జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఖమ్మం

గురువారం | 26 | జూన్ | 2025 ◆ పేజీలు : 4



వరద విపత్తులను ఎదుర్కొనేందుకు

# సన్నద్ధం కావాలి

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

- పునరావాస కేంద్రాలను సమీప ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలి
- నీటి వనరుల స్థితిగతులను నిరంతరం పర్యవేక్షించాలి
- జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో విపత్తుల నిర్వహణపై సమీక్షించిన జిల్లా కలెక్టర్



2 లో...

అర్హులైన నిరుపేదలకు...

# ప్రభుత్వ సంక్షేమ పథకాలు

రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు

- నగరంలో పారిశుధ్య నిర్వహణ, పచ్చదనం పెంపుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- సీజనల్ వ్యాధుల వ్యాప్తి నియంత్రణకు ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలి
- ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 4వ డివిజన్ లో సీసీ రోడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల

**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి:** అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.మంత్రివర్యులు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి బుధవారం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 4వ డివిజన్ రాజీవ్ నగర్ గుట్ట ప్రాంతంలో టి.యు.ఎఫ్. ఐ.డి.సి. నిధులు 50 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ 4వ డివిజన్ రాజీవ్ నగర్ గుట్ట ప్రాంతంలో అవసరమైన విద్యుత్ లైన్లు వేసేందుకు నిధులు చెల్లించామని, స్థానిక అధికారులు దగ్గరుండి

మిగతా 2 లో...







ప్రభుత్వ ఆసుపత్రుల్లో

# మెరుగైన సేవలు అందించాలి

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

- కిచెన్ లో మెనూ ప్రకారం భోజనం శుచికరంగా తయారు చేయాలి
- మందుల కొరత ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకొని రావాలి
- జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి:** మెరుగైన సేవలతో ప్రజల్లో ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెంచాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.జిల్లా కలెక్టర్, బుధవారం ఉదయం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఉన్న

మిగతా 2 లో...

# నియోనేటల్ వైద్య సేవలు

గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థ ఉమ్మడి జిల్లా మేనేజర్ శివకుమార్

**నేలకొండపల్లి, జూన్ 25 ప్రజాజ్యోతి :** జిల్లా వ్యాప్తంగా అధునాతన పరికరాలతో నియోనేటల్ వైద్య సేవలు అందిస్తున్నట్లు ఈఎంఆర్ఎ, గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థ ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ శివకుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సీహెచ్సీ ఆసుపత్రి వద్ద బుధవారం నియోనేటల్ వైద్య సేవలు గురించి అవగాహన సదస్సు ను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు.. ఖమ్మం జిల్లాలో 21, భద్రాద్రి కొత్తగూడెం

మిగతా 2 లో...





రైతుల అభివృద్ధికి

# బ్యాంకులు దోహదపడాలి...

- మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు
- వేంసూర్ మండలం అడసర్లపాడు, కందుకూరు లో సహకార బ్యాంకు లను ప్రారంభించిన మంత్రి తుమ్మల.

**సత్తుపల్లి, జూన్ 25 (ప్రజాజ్యోతి):** రైతుల అభివృద్ధికి బ్యాంకులు తమ వంతు సహకారం అందించి, దోహదపడాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. బుధవారం వేంసూర్ మండలం అడసర్లపాడు, కందుకూరు గ్రామాల్లో పర్యటించి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లిమిటెడ్ నూతన బ్రాంచిలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ రైతుల అభివృద్ధికి బ్యాంకులు సంపూర్ణ సహకారం అందించాలని అన్నారు. పంట రుణాలతో పాటు వ్యవసాయ రంగ అభివృద్ధికి దోహదపడే విధంగా వ్యవసాయ టర్మ్ రుణాలు, వ్యవసాయ సంబంధిత రంగాల అభివృద్ధికి రుణాలను నిర్దేశించు కున్న లక్ష్యాల ప్రకారం పంపిణీ చేయాలని మంత్రి సూచించారు.గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటుచేసిన సహకార బ్యాంక్ బ్రాంచీలు స్థానిక రైతాంగానికి మేలు చేయాలని అన్నారు. ప్రభుత్వం అమలు చేసే రైతు భరోసా, ధాన్యం కొనుగోలు, బోనస్, పంట నష్ట పరిహారం

మిగతా 2 లో...

## వరద విపత్తులను ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావాలి

**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి:** వరద విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులు సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలీస్ కమీషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ లతో కలిసి విపత్తుల నిర్వహణపై జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో బుధవారం సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ గతంలో ముంపునకు గురైన ప్రతి హ్యాబిటేషన్ ఇంటిలో ప్రజలను మరోసారి వరదలు వస్తే ఎక్కడికి తరలిస్తామనే మైక్రో లెవల్ ప్లానింగ్ సిద్ధం చేసుకోవాలని అన్నారు.వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు వీలుగా సమీపంలో రిహాబిలిటేషన్ సెంటర్ లను గుర్తించి, అక్కడ అవసరమైన మౌళిక సదుపాయాలను కల్పించాలని, పునరావాస కేంద్రాల సమాచారం ముందుగానే వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు అందించాలని, వరద రాగానే ఆ కేంద్రాలకు వెళ్లేలా ప్రజలను సిద్ధం చేయాలని అన్నారు.సమీకృత జిల్లా కలెక్టరేట్ లో 24 గంటల పాటు పని చేసే కంట్రోల్ రూమ్ వెంటనే ఏర్పాటు చేయాలని, ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదు నమోదు చేసుకొని సత్వరమే పరిష్కరించేలా వ్యవస్థ ఏర్పాటు చేయాలని అన్నారు.వరదల గురించి ముందుగానే మనకు సమాచారం అందేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో ఉన్న నీటి వనరులను నిరంతరం మానిటరింగ్ చేయాలని అన్నారు.వరద ప్రభావిత ప్రాంతాల్లో, నీటి వనరులకు సమీప ప్రాంతాల్లో అవసరమైన బోట్లు, రోప్స్, లైఫ్ జాకెట్, మైక్స్, లైట్లు అందుబాటులో ఉంచాలని, గజ ఈతగాళ్ళ ను పంపే విధంగా జాబితా సిద్ధం చేసి పెట్టుకోవాలని అన్నారు. 300 మంది ఆపద మిత్రల సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా ప్రణాళిక తయారు చేయాలని, విపత్తుల నిర్వహణ కోసం ఎన్.డి.ఆర్.ఎఫ్. బృందాలను స్థానికంగా అందుబాటులో ఉంచినట్లు కలెక్టర్ తెలిపారు.వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస కేంద్రాల నిర్వహణ, అక్కడ ప్రజలకు అవసరమైన ఆహార సరఫరా, మెడికల్ క్యాంపు ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణకు మున్సిపల్, స్థానిక సంస్థల ద్వారా ప్లానింగ్ చేయాలని అన్నారు.ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, జిల్లాలో ఉన్న మున్సిపాల్టీలలో వాటర్ లాగింగ్ లేకుండా అవసరమైన మరమ్మత్తు పనులు వెంటనే పూర్తి చేయాలని అన్నారు. వరదల సమయంలో క్షేత్రస్థాయి పరిస్థితుల సమాచారం అధికారుల నుంచి వెంటనే తనకు అందాలని కలెక్టర్ ఆదేశించారు.పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే ముందు జాగ్రత్త చర్యలు చాలా అవసరమని అన్నారు. లో తట్టు ప్రాంతాల స్థానిక నాయకులతో సమన్వయంతో ఉండాలని, ప్రజలలో అనవసర ఆందోళన సృష్టించవద్దని అన్నారు.వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలను సమీప ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని, లోతట్టు ప్రాంతాల్లోనీ రోడ్డు గుంతలు పూడ్చివేయాలని అన్నారు.అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ జిల్లాలో పునరావాస కేంద్రాలలో ప్రజలను తరలించినప్పుడు అవసరమైన ఏర్పాట్లు కల్పించాలని అన్నారు. ముంపు ప్రాంతాల ప్రజలకు ముందస్తుగా జిప్ కవర్లు పంపిణీ చేయాలని, ముఖ్యమైన పత్రాలు, ఆభరణాలు వాటిలో భద్రపర్చుకొనేటట్లు తెలియజేయాలని అన్నారు. ప్రతి మండలంలో గజ ఈతగాళ్ళ జాబితా సిద్ధం చేసి పెట్టుకోవాలని అన్నారు.ఈ సమావేశంలో డీఆర్వో ఏ. పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీలు, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల అభివృద్ధికి బ్యాంకులు దోహదపడాలి...



(మొదటి పేజీ తరువాయి...) వంటి వివిధ కార్యక్రమాలను సకాలంలో అందచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వర రావు, కల్లూరు ఆర్డీవో ఎల్ రాజేందర్ గౌడ్, డిసిసిబి డిజిఎం వేణుగోపాల్ రావు, సర్వేశ్వర్ రావు, ఏజిఎం చందు రావు, మేనేజర్లు నాగలక్ష్మి , రజిత, అలీమ్, తెలంగాణ రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ లీడర్ డాక్టర్ మట్టా దయానంద్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, డిసిసిబి డైరెక్టర్ చల్లగుండ్ల నరసింహారావు, ఐలూరి వెంకట్ రెడ్డి,నిర్మల పుల్లారావు, బోబోలు లక్ష్మణ్ రావు, రామ్ బ్రహ్మం, పుచ్చకాయల సోమిరెడ్డి,వెల్ది జగన్మోహన్రావు,మండల పార్టీ అధ్యక్షులు కాసర చంద్రశేఖర్ రెడ్డి, వ్యవసాయ శాఖ వైస్ చైర్మన్ వెంకటప్పా రెడ్డి, చెన్నారావు, కొప్పుల వెంకటేశ్వర రెడ్డి, వినుకొండ కృష్ణ, గొర్ల మారి రామ్మోహన్ రెడ్డి రైతులు, అధికారులు, పాల్గొన్నారు.

## అర్హులైన నిరుపేదలకు...
# ప్రభుత్వ సంక్షేమ పథకాలు

(మొదటి పేజీ తరువాయి...) సరిగ్గా పని చేయించుకోవాలని అన్నారు. నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.6వ డివిజన్ లో ప్రజలందరి భాగస్వామ్యంతో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం చేపట్టాలని అన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన పనులు వానలు రాకముందే పూర్తి చేయాలని, డ్రైయిన్ నిర్మాణ పనులు ప్రాధాన్యతగా చేపట్టాలని అన్నారు.100 రోజుల యాక్షన్ ప్లాన్ అన్ని డివిజన్ లలో అమలు చేయాలని, వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పేదలు నివసించే ప్రాంతాల్లో అధిక శ్రద్ధతో ప్రభుత్వ కార్యక్రమాలు అమలు చేయాలని అన్నారు. నగరంలో పెండింగ్ అంతర్గత రోడ్డు, డ్రైయిన్ నిర్మాణ పనులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, వర్షాకాలం ముగిసిన తర్వాత వాటిని మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు.డివిజన్ ను పరిశుభ్రంగా ఉంచుకోవడం, పెద్ద ఎత్తున మొక్కలు నాటి పచ్చదనం పెంచడం బాధ్యతగా చేయాలని, ఖాళీ స్థలంలో నీరు నిల్వ ఉండకుండా, చెత్త పేరుకొని పోకుండా చూడాలని, ప్రైవేట్ ఖాళీ స్థలాలకు ఫెన్సింగ్, గ్రౌండ్ లెవెలింగ్ వంటి పనులు చేపట్టాలని భూ యజమానులకు నోటీసులు జారీ చేయాలని అన్నారు. నగర మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ★ డివిజన్ లో అంతర్గత రోడ్లు, డ్రైయిన్ నాణ్యతతో నిర్మించుకోవాలని అన్నారు. మన ఇంటి ముందు చెత్త వేయవద్దని, కార్పోరేషన్ అధికారులకు సహకరించాలని అన్నారు. ఖమ్మం నగరాన్ని సుందరంగా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తున్నామని, ప్రజలు తమ వంతు బాధ్యత నెరవేర్చాలని అన్నారు.నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ★ 580 మీటర్ల మేర రోడ్డు నిర్మాణ పనులకు 50 లక్షల రూపాయలతో నేడు శంకుస్థాపన చేశామని అన్నారు. నగరాన్ని సుందరంగా తీర్చి దిద్దేందుకు రోడ్డు విస్తరణ పనులు, పేయింటింగ్ పనులు, పారిశుధ్య నిర్వహణ కోసం నూతన వాహనాలను కొనుగోలు చేశామని అన్నారు. నగరంలో ప్రజలకు ప్రాథమిక వసతుల కల్పన లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహ్రా, పబ్లిక్ హెల్త్ ఇఇ వి.రంజిత్, మునిసిపల్ ఇఇ కృష్ణలాల్, ఖమ్మం. ఆర్డీఓ నరసింహా రావు, ఖమ్మం అర్బన్ తహసిల్దార్ సైదులు, కార్పొరేటర్ లు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నియోనేటల్ వైద్య సేవలు



(మొదటి పేజీ తరువాయి...) జిల్లాలో 28, 108 అంబులెన్స్ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో వాహనం కనీసం నెలకు 120 వివిధ రకాల సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని వివిధ రకాల అత్యవసరాలలో హస్పిటల్ కు వెళ్లాలని అనుకునే వారు తప్పకుండా 108 సేవలను వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా కు తొలిసారిగా నియోనేటల్ వాహానం మంజూరైనట్లు తెలిపారు. ఈ వాహానంలో అనేక అత్యాధునిక వైద్య పరికరాలు, ప్రత్యేక వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారని అన్నారు. నవజాతి శిశు సంరక్షణ కోసం ఈ వాహానం ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ వాహానం ద్వారా వైద్య సేవలు పొందేందుకు అవసరమైన అవగాహన కోసం వైద్యులకు ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్వీస్లు నిత్యం అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడికల్ ఎగ్జిక్యూటివ్ అధికారి దుర్గాప్రసాద్, 108 సిబ్బంది ఆజీమ్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యవాదులను జైళ్ళకు పంపుతున్న బీజేపీ ప్రభుత్వం..

- సీపీఎం రాష్ట్ర నాయకులు పొన్నం వెంకటేశ్వరావు..

**తల్లాడ, జూన్ 25 (ప్రజా జ్యోతి న్యూస్):** నాటి కాంగ్రెస్ ఇందిరాగాంధీ ప్రభుత్వం 1975 జూన్ 25 న అర్ధరాత్రి ఎమర్జెన్సీ ప్రకటించి లక్షలాది మంది ప్రజాస్వామిక వాదులను అరెస్టులు చేసి జైళ్లలో పెట్టి వికృత శ్రేష్టలకు వడిగట్టిందని స్వేచ్ఛాయుత భారతంలో ప్రశ్నించే తత్వం లేకుండా సైనిక పరిపాలన కొనసాగించిందని నేటి బిజెపి ప్రభుత్వం ఎమర్జెన్సీ ప్రకటించకుండానే నాటి కాంగ్రెస్ ప్రభుత్వ విధానాన్ని ఎమర్జెన్సీ ని గుర్తు చేసే విధంగా పరిపాలన కొనసాగిస్తుందని సిపిఎం పార్టీ రాష్ట్ర నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం తల్లాడలో పులి వెంకట నరసయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వతంత్ర సంస్థలైన సిబిఐ ఈడి ఎన్నికల కమిషన్ న్యాయవ్యవస్థలను తమ ప్రభుత్వానికి అనుకూలంగా వాడుకుంటూ అనేకమంది ప్రజాస్వామ్యక వాదులను ప్రశ్నించే వాళ్లను దేశద్రోహం కేసులు నమోదు చేసి జైళ్లలో పెడుతుందని స్టాన్ స్వామి ప్రొఫెసర్ సాయిబాబా వరవరరావు తదితరులు జైళ్లలో పెట్టి ఎటువంటి విచారణ లేకుండా చేసిందని 80 సంవత్సరాల వయసులో స్టాన్ స్వామి జైల్లోనే శ్వాస విడిచారని, సాయిబాబా చివరి దశలో నిర్దోషిగా విడుదలై చనిపోయారన్నారు. పత్రికలను, ఎలక్ట్రానిక్ సోషల్ మీడియా స్వేచ్ఛను అడ్డుకుంటుందని బ్యాంకులను నిర్వీర్యం చేస్తుందని జాతీయ సంపదను ప్రైవేటు రంగానికి తమ అనుకూల పెట్టుబడిదారులకు కట్టబెడుతుందని ప్రజల మధ్య కుల మతాల పేరుతో చిచ్చు పెట్టి పరిపాలన కొనసాగిస్తుందని దేశ సార్వభౌమత్వాన్ని అమెరికాకు తాకట్టు పెట్టిందని అన్నారు. కగార్ పేరుతో దేశ ప్రజల పైనే సైనిక చర్య కొనసాగిస్తుందని మహాత్మా దేశద్రోహులను ఇప్పటివరకు పట్టుకోలేదని అన్నారు. ఈ సదస్సులో పార్టీ మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, కళ్యాణపు కృష్ణయ్య, సేలం పకీరమ్మ, రాజబోయిన సైదులు, షేక్ మస్తాన్, సత్తెనపల్లి నరేష్, చల్లా నాగేశ్వరావు, పారసాని వెంకటయ్య పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన సేవలు అందించాలి



(మొదటి పేజీ తరువాయి...) టాయిలెట్స్, డయాలసిస్ వార్డు, ఫార్మసీ స్టోర్, జనరల్ వార్డు, కిచెన్ లను తనిఖీ చేసి, ఆసుపత్రిలోని రోగులతో కలెక్టర్ మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పురుషుల మెడికల్ వార్డు లో అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎప్పుడు, ఏ ఇబ్బందితో ఆసుపత్రికి వచ్చింది, డాక్టర్లు చూశారా, మందులు ఇచ్చారా, పరీక్షలు చేస్తున్నారా, నర్సులు, సిబ్బంది సేవలపై రోగులను అడిగి కలెక్టర్ ఆరా తీశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మనం మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు. ఆసుపత్రి ప్రాంగణం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుద్ధ్యం అంశంలో ఎటువంటి లోటుపాట్లు ఉండటానికి వీలు లేదని, అత్యంత ప్రాధాన్యత అంశంగా పరిగణించాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ప్రభుత్వ ఆసుపత్రి ఫార్మసీ స్టోర్ లో అన్ని రకాల డ్రగ్స్ ( మందులు ) అందుబాటులో ఉండాలని, ఏ డ్రగ్ స్టాక్ చివరికి వచ్చినా లేఖ రాసి వదిలేయకుండా వెంటనే తన దృష్టికి తీసుకొని రావాలని, వైద్య శాఖ ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు ఫాలో అప్ అవుతూ ఆసుపత్రిలో మందుల స్టాక్ వచ్చేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.ఆసుపత్రిలో కిచెన్ విభాగంపై ఫిర్యాదులు రాకుండా చూడాలని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం రుచి, శుచికరమైన ఆహారం అందించాలని, ఆసుపత్రికి వచ్చే పేద ప్రజలను ఇబ్బందులకు గురి చేయవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు.ఆసుపత్రిలో ఉన్న ల్యాబ్ ద్వారా అవసరమైన రోగులకు రెగ్యులర్ గా నిర్ధారణ పరీక్షలు జరపాలని, పరీక్ష ఫలితాలను సకాలంలో అందించాలని అన్నారు. పరీక్షల రిజిష్టరు ను పరిశీలించి, ఏ ఏ పరీక్షలు చేపడుతున్నది, ఫలితాలు ఇస్తున్న వివరాలు పరిశీలించారు. పరీక్షల కిట్ల లభ్యతను అడిగి తెలుసుకున్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు ఎటువంటి పరీక్షల నిమిత్తం రాయవద్దని కలెక్టర్ తెలిపారు. సమయపాలన పాటించాలని, అనుమతి లేకుండా గైర్హాజరు కారాదని అన్నారు.ఈ ఆకస్మిక తనిఖీ సమయంలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. ఎల్. కిరణ్ కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ డా. బి. కిరణ్ కుమార్, ఆర్ఎంఓ డా. రాంప్రసాద్, డా. రాంబాబు, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# మొక్కలు పెంచడంలో ఖమ్మం జిల్లాని ఆదర్శంగా నిలుపాలి

## కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

- వన మహోత్సవానికి నర్సరీలలో మొక్కలు సిద్ధం చేయండి
- మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక కార్యచరణ
- చింతకాని మండలం వందనం గ్రామంలోని నర్సరీని సందర్శించి మొక్కలను పరి శీలించిన జిల్లా కలెక్టర్





**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి :** స్థానిక పచ్చదనం పెంపొందించేందుకు నిర్వహించే వన మహోత్సవం కార్యక్రమంలో విస్తృతంగా మొక్కలు నాటేందుకు సంబంధిత శాఖల అధికారులు మొక్కలు సిద్ధం చేయాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.జిల్లా కలెక్టర్ చింతకాని మండలంలో బుధవారం పర్యటించారు. వందనం గ్రామంలోని నర్సరీని సందర్శించి, నర్సరీ అంతా కలియతిరిగి మొక్కలను పరిశీలించారు. జిల్లాలో వన మహోత్సవంలో భాగంగా నిర్దేశిత లక్ష్యం మేరకు మొక్కలు నాటేందుకు ప్రతి గ్రామంలో వన నర్సరీల ద్వారా మొక్కలు పెంచి అదే గ్రామంలో నాటించడానికి ఏర్పాట్లు చేయాలని, మొక్కల సంరక్షణకు చేయాల్సిన కార్యచరణ సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ మొక్కలు పెంచడంలో ఖమ్మం జిల్లాకు ఆదర్శంగా నిలపాలన్నారు. గతం కంటే స్పష్టమైన మార్పు కనిపించాలన్నారు. వన మహోత్సవం కార్యక్రమం క్రింద జిల్లాలో ప్రతి శాఖ, వారికి కేటాయించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని అన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు అవసరమైన ట్రీ గార్డ్ మొదలైన ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. ప్రతి శాఖ ఏ మొక్కలు నాటుతున్నామో స్పష్టమైన రికార్డు నిర్వహించాలన్నారు. 2 మీటర్ల ఎత్తు కంటే చిన్న మొక్కలు పెట్టడానికి వీలులేదని కలెక్టర్ తెలిపారు. మొక్కలు నాటే స్థలం ట్యాగ్ చేసి పెట్టుకోవాలని అన్నారు. గ్రామీణ అభివృద్ధి శాఖ పరిధిలో లక్ష్యం చేరుకునేందుకు అవసరమైన మేర గుంతల తవ్వకం పనులు ఉపాధి హామీ పథకం క్రింద చేపట్టాలని కలెక్టర్ సూచించారు. వన మహోత్సవం కార్యక్రమం క్రింద సర్వైవల్ రేట్ అధికంగా ఉండే మొక్కలు నాటడానికి ప్రాధాన్యత కల్పించాలని కలెక్టర్ తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయాలని అన్నారు. వార్డు అధికారులు తమ వార్డు పరిధిలో మొక్కలు నాటడం వాటి సంరక్షణకు బాధ్యతలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.వన మహోత్సవం కార్యక్రమం క్రింద ఇళ్లకు పంపిణి చేసే మొక్కల పెంపకం సైతం అధికారులు పరిశీలించాలని మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు.అనంతరం కలెక్టర్, వందనం గ్రామంలోని స్వయంభు శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయంను దర్శించుకున్నారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు ఆశ్వీరాదం ఇచ్చి స్వామి వారి శేషవస్త్రం, తీర్థాప్రసాదాలు కలెక్టర్ కు అందించారు.ఈ కార్యక్రమంలో డిఆర్డీవో సన్యాసయ్య, చింతకాని ఎంపీడివో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మాదక ద్రవ్యం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కారించుకొని స్కూల్ విద్యార్థులకు పెయింటింగ్ కాంపిటీషన్

- టౌన్ ఏసీపీ శ్రీనివాసులు





**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి :** స్థానిక అంతర్జాతీయ మాదక ద్రవ్యం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కారించుకొని బుధవారం ఖానాపురం హవేలీ పోలీసుల ఆధ్వర్యంలో ఎస్ ఎఫ్ ఎస్ స్కూల్ విద్యార్థులకు పెయింటింగ్ కాంపిటీషన్ నిర్వహించారు.ముఖ్యతిదిగా కార్యక్రమంలో పాల్గొన్న టౌన్ ఏసీపీ రమణమూర్తి మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వాడకంతో కలిగే నష్టాలపై వివరించారు. మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించే లక్ష్యంలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని సూచించారు.మత్తు పదార్థాలు అలవాటుపడి యువత మేధాశక్తిని వృథా చేసుకోవద్దని, డ్రగ్స్ ఒకసారి వాడినా వ్యసనంగా మారే ప్రమాదం ఉందని, డ్రగ్స్ వినియోగాన్ని యూత్ సోషల్ స్టేటస్, ఫ్యాషన్గా ఎంచుకోవడం దురదృష్టకారమని అన్నారు. దీనిద్వారా విలువైన జీవితాలు నష్టపోతారని గ్రహించాలని ఆయన అన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పిన సూచనలు పాటిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. డ్రగ్స్ తీసుకుంటున్నా, విక్రయిస్తున్నా పోలీసులకు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ భానుప్రకాశ్ ,స్కూల్ ప్రిన్సిపల్ పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమతంగా ఉండాలి

- మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తగిన చర్యలు జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్.రాజశేఖర్.



**నేలకొండపల్లి, జూన్ 25 ప్రజా జ్యోతి :** సీజనల్ వ్యాధుల పట్ల అప్రమతంగా ఉండాలని జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్. రాజశేఖర్ గౌడ్ సూచించారు. స్థానిక కమ్యూనీటి హెల్త్ సెంటర్ ను బుధవారం ఆకస్మికంగా తనీఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. పేషెంట్ల వద్దకు వెళ్లి వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందిస్తున్న భోజనం ను పరిశీలించారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో సమీక్ష సమావేశం ను నిర్వహించారు. ఆయన మాట్లాడారు....సీజనల్ వ్యాధులు కాలం ప్రారంభమైనందున్న ప్రజలకు అవగాహాన కల్పించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా తగిన వైద్య సేవలు అందించేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. విధులు పట్ల నిర్లక్ష్యం ను సహించేది లేదని హెచ్చరించారు. సమయపాలన పాటించాలని ఆదేశించారు. రోగులకు ఇబ్బందులు లేకుండా తగిన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మంగళ, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటం చేయాలి

- సిపిఐ జిల్లా మండల కార్యదర్శి కర్నాటి భాను ప్రసాద్




**నేలకొండపల్లి, జూన్ 25 ప్రజా జ్యోతి :** ప్రజా ఉద్యమాలే ఊపిరిగా పోరాటాల ప్రాణంగా ప్రజలకు అండగా సిపిఐ పోరాడుతుందని సిపిఐ మండల కార్యదర్శి కర్నాటి భాను ప్రసాద్ అన్నారు. బుధవారం నేలకొండపల్లి సిపిఐ మండల కౌన్సిల్ సమావేశం ను కర్నాటి కృష్ణయ్య భవనం వద్ద కనకబండి సీతారాములు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు..... ఓట్ల కోసం కాకుండా ప్రజా సమస్యలే ఎజెండాగా నిత్యం ప్రజల మధ్య నిలబడి పోరాడేది సిపిఐ పార్టీ అని అన్నారు. దున్నేవాడికే భూమి కావాలని, శ్రమ దోపిడి వ్యతిరేకంగా బడుగు బలహీన వర్గాలను ఏకం చేసి తెలంగాణ రైతంగ పోరాటానికి నాయకత్వం వహించిన పార్టీ సిపిఐ అని అన్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అన్ని హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని ఆయన కోరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతోన్మాద రాజకీయాలతో ప్రజా సమస్యలను విస్మరించి పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే వాటిని అదుపు చేయకుండా పేదవారి నడ్డి విరుస్తుందని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ పార్టీ తరఫున పోటీ చేసేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ పార్టీ సహాయ కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు, రైతు సంఘం మండల కార్యదర్శి పాల్తియ శ్రీనివాస్ రావు, కార్యవర్గ సభ్యులు మల్లెబోయిన ఉపేందర్,కర్నాటి నళిని రాణి,రాయల మాదవ్ రావు,మాళోతు అయోధ్య, పాలపాటి అశోక్, కౌన్సిల్ సభ్యులు చావా గణపతి, వల్లలా కృష్ణ, పొలంపల్లి నారాయణ,కాశబోయిన అయోధ్య, మేకల పుల్లయ్య, అనంత పుల్లయ్య, యలగాల వేంకటేశ్వర్లు,బాలిన కృష్ణంరాజు, తమ్మిశెట్టి మమత, భూక్యా రాములు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల నమోదు సంఖ్య లేకుంటే కష్టమే



**నేలకొండపల్లి, జూన్ 25 ప్రజా జ్యోతి :** విద్యార్థుల సంఖ్య పెంచుకోకుంటే.. కష్టమేనని మండల విద్యాశాఖాధికారి బీ.చలపతిరావు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయులకు సమావేశం ను నిర్వహించారు. బడిబాట లో విద్యార్థుల సంఖ్య నమోదు లేని పాఠశాలల పై రివ్వూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంటే సర్దుబాటు చేయాల్సిన పరిస్థితులు వస్తాయని పేర్కొన్నారు. కావునా బడిబాటలో భాగంగా విద్యార్థుల సంఖ్య ను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. చేరిన విద్యార్థులను రెగ్యూలర్ గా వస్తున్నారా లేదా నిత్యం ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రభుత్వం అందించే ఉచిత పుస్తకాలు, ఏకరూప వస్త్రాలు, నాణ్యమైన బోజనం తదితర వాటి గురించి వివరించి తల్లిదండ్రులను ఒప్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ లు ప్రసాద్, కె.వెంకటేశ్వర్లు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## 50 ఏళ్ల నాటి ఎమర్జెన్సీ అనుభవాలతో నయా ఫాసిజం ప్రమాదాన్ని ఎదుర్కోవాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదినేని రమేష్



**సత్తుపల్లి జూన్25(ప్రజా జ్యోతి)** 50 ఏళ్ల ఎమర్జెన్సీ నేటి నయా ఫాసిస్టు ప్రమాదం అనే అంశంపై సదస్సు మంగళవారం సిపిఎం సత్తుపల్లి మండల, టౌన్ కమిటీల ఆధ్వర్యంలో రావి వీర వెంకయ్య భవనంలో మోరంపూడి పాండు రంగారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదినేని రమేష్ మాట్లాడుతూ 1975 జూన్ 25న అర్ధరాత్రి ఆనాటి భారత ప్రధాని ఇందిరాగాంధీ, కాంగ్రెస్ నాయకత్వంలోని భారత ప్రభుత్వం దేశంలో ఎమర్జెన్సీ విధించింది. అది 1977 మార్చి 21 వరకు కొనసాగిందన్నారు,21 నెలల పాటు దేశాన్ని జైలుగా, చీకటి రాజ్యంగా మార్చి వేశారు, రెండు లక్షల మందికి పైగా సిపిఎం తో సహా ప్రతిపక్ష పార్టీల నాయకులను, చివరికి కాంగ్రెస్ లోని ఇందిరా గాంధీని వ్యతిరేకించే నాయకులతో సహా జైళ్లలో నిర్బంధించారు, పత్రిక స్వేచ్ఛను, పౌర హక్కులను అంచివేశారు, ఎన్కౌంటర్ల పేరుతో వందలాదిమంది యువకులను పట్టుకొని కాల్చి చంపారు, ఇది భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ, చరిత్రలో చీకటి అధ్యాయం ఆ ఎమర్జెన్సీ ప్రకటించి నేటికి 50 సంవత్సరాలు పూర్తయిందన్నారు. సిపిఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ నేడు దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలు జరుగుతుంద న్నారు, నేటి ఆర్ఎస్ఎస్ సారథ్యంలోని బిజెపి ప్రభుత్వం నాటి చీకటి రోజులను తలదన్నేలా పాలన చేస్తుందన్నారు, పౌర హక్కుల, మానవ హక్కుల నాయకులను, జర్నలిస్టులను జైళ్ళలో నిర్బంధించిందన్నారు, రాజ్యాంగ వ్యవస్థల దుర్వినియోగం, దేశ సంపద బడా కార్పొరేట్ దోపిడీదారులకు అండగా బిజెపి ప్రభుత్వం ఉంది అన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ శ్రేణులు నయా ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్య పరచాలని, ఉద్యమాలలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమం లో సత్తుపల్లి టౌన్, మండల కార్యదర్శులు కొలిక పోగు సర్వేశ్వరరావు, జాజిరి జ్యోతి, మోరంపూడి వెంకటరావు, పాకలపాటి మల్లికార్జునరావు, బాల బుచ్చయ్య, అయినంపూడి సనంధన్ రావు , చెరుకు రత్నకుమారి, పాకలపాటి ఝాన్సీ,పుష్పవల్లి, వేపులపాటి కుమారస్వామి, బండి వేలాద్రి, భాస్కర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మేనేజర్ ( ఆపరేషన్స్ ) కళ్యాణ్ రామ్ కు శుభాకాంక్షలు... ఐఎన్టీయూసీ




**సత్తుపల్లి జూన్25(ప్రజా జ్యోతి )**సత్తుపల్లి జే.వి.ఆర్ ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ కు మేనేజర్ ( ఆపరేషన్స్)కళ్యాణ్ రామ్ నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్ ఆదేశాల మేరకు ఆయనను బుధవారం మర్యాదపూ ర్వకంగా కలిసి ఐఎన్టీయూసీ ఫిట్ సెక్రటరీ రామారావు ఆధ్వర్యంలో బ్రాంచ్ సెక్రటరీ తీగల క్రాంతి కుమార్ పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. తీగల క్రాంతి కుమార్ మాట్లాడుతూ సింగరేణి సంస్థ 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను నిర్దేశించిన ఉత్పత్తి , ఉత్పాదకత లక్ష్యాల సాధనలో ప్రత్యేక గుర్తింపు సాధించి మంచి పేరు ప్రఖ్యాతలు ఉన్నత స్థాయి అధికారుల మన్ననలు సంపాదించాలని వారు ఆకాంక్షించారు. గని ప్రగతి కోసం క్రమశిక్షణ,పట్టుదల , అంకితభావం ప్రద ర్శిస్తూ సంస్థ అభ్యున్నతి కోసం పనిచేసే కార్మికులపై ప్రేమాభిమానాలు చాటుతూ, వారిని మరింత ప్రోత్సహించి కార్మిక వర్గంలో మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించాలని,ప్రమాద రహిత గనిగా తీర్చి దిద్దేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ బ్రాంచ్ నాయకులు నాగ ప్రకాష్, సీతా రామరాజు,అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీలు కోటి,ఐ వి రెడ్డి,మైనింగ్ స్టాఫ్ ఇంచార్జ్ కాజా మొయినుద్దీన్, నాయకులు తిరుమలరావు,రాము, నాగేందర్, కిషన్ రావు, కొమురయ్య,రమేష్, శ్రీనివాసరావు,నరేందర్, గుమ్మడి వెంకటేశ్వర్లు,గాలి వెంకటేశ్వర్లు,లింగమూర్తి, అశోక్,షట్రక్ బాబు ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

# చదువుతోనే సమాజంలో ఉన్నత స్థానం

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ప్రైవేట్ కంటే ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య
- పాఠశాలలో విద్యార్థుల కు పాఠ్యపుస్తకాలు, నిపామ్స్ పంపిణీ
- చింతకాని మండలం వందనం గ్రామంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్





**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి :**చదువుతోనే సమాజంలో ఉన్నత స్థానం సాధించవచ్చని, ప్రైవేట్ కంటే మెరుగ్గా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.బుధవారం చింతకాని మండలం వందనం గ్రామంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. కలెక్టర్ స్కూల్ పరిసరాలు, పిల్లల టాయిలెట్స్, వంటగది, పాఠశాల నందు తరగతి గదులు తిరుగుతూ, విద్యా బోధన ప్రక్రియను పరిశీలించారు.పాఠశాలలో మొదటి తరగతి, ఐదవ తరగతి క్లాస్ రూం లోకి వెళ్లి ఉపాధ్యాయురాలు ఇంగ్లీష్ బోధిస్తున్న తీరును పరిశీలించారు. విద్యార్థులతో కలెక్టర్ ఇంగ్లీష్ లో మాట్లాడారు. పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు వచ్చాయా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు కొత్త వర్క్ బుక్స్ లను కలెక్టర్ పంపిణీ చేశారు. నాణ్యమైన విద్యా బోధనతో పాటు విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాల సాధన దిశగా విద్యార్థులు ఇప్పటి నుంచే కృషి చేయాలని అన్నారు. విద్యార్థులు వారి ఆరోగ్యం, ఎదుగుదల పట్ల కూడా శ్రద్ధ వహించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు.జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు రెండు జతల ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ అందిస్తున్నామని తెలిపారు. విద్యతోనే భవిష్యత్తు బాగుంటుందని, తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుని తమ పిల్లలు బాగా చదవాలని పాఠశాలలకు పంపుతుంటారని, విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే విధంగా బాగా చదివి ఉన్నత శిఖరాలను అవరోధించాలన్నారు . కష్టపడి చదివే విద్యతోనే భవిష్యత్తులో గొప్ప ఉద్యోగాలు సాధించుకోవచ్చు అని అన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పిల్లలకు వడ్డించే మధ్యాహ్న భోజనం అన్నం, కూరలు, కోడిగుడ్డు నాణ్యతను పరిశీలించారు. కలెక్టర్ తనిఖీ సందర్భంగా జిల్లా విద్యా శాఖ అధికారి ఎస్. సత్యనారాయణ, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

---

## మతం పేరుతో ఉన్మాదం చేసే ఎవరైనా ఉగ్రవాదే!

- పదిసార్లు పార్టీ మారిన వారికి మమ్మల్ని విమర్శించే హక్కు లేదు
- కూసుమంచి మండల మహాసభలో సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు







**పాలేరు జూన్25 ప్రజా జ్యోతి:**భారతదేశంలో స్వాతంత్రానికి ముందు స్వాతంత్రం తరువాత కార్మికులకు, కర్షకులకు ప్రజలకు హక్కులు సాధించి పెట్టడంలో భారత కమ్యూనిస్టు పార్టీ తో పాటు ఇతర కమ్యూనిస్టు పార్టీలు కీలకపాత్ర పోషించాయని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు కొనియాడారు. సిపిఐ కూసుమంచి మండల మహాసభ అమరజీవి సంగబత్తుల వెంకటరెడ్డి, పోటు ప్రసాద్ ప్రాంగణం కూసుమంచి మండల కేంద్రంలోని యోగానందం ఫంక్షన్ హాల్ లో సంగబత్తుల ఉపేందర్ రెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగింది. తొలుత మండల కేంద్రంలో పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహాసభల ప్రారంభ సూచకంగా ఏర్పాటుచేసిన అరుణ పతాకాన్ని సీపీఐ సీనియర్ నాయకులు భూక్య మంగ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భాగం హేమంతరావు మాట్లాడుతూ.. మతం పేరుతో ఉన్మాదం చేసే వాళ్ళు ఉగ్రవాదలతో సమానమని, వంద సంవత్సరాల కాలంలో సిపిఐ పార్టీ లేదా కమ్యూనిస్టు పార్టీలు దేశానికి ఏం చేశాయని కొంతమంది అవివేకులు కళ్ళున్నా చూడలేని కబోదులు మాట్లాడుతున్నారని ప్రస్తుత యువతకు కూడా కమ్యూనిస్టు పార్టీ తెలియజెప్పాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. భారతదేశ స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొని స్వాతంత్రం అనంతరం కూడా ప్రజల కార్మిక కర్షక హక్కుల కోసం అనునిత్యం పోరాటం చేస్తున్న పార్టీ సిపిఐ అన్నారు. సిపిఐ తో పాటు ఇతర కమ్యూనిస్టు పార్టీలు కలిసి పోరాటం చేయటం వల్లనే దేశంలో జమీందారులు జాకీర్దారుల పటేల్ పట్వారి ల వ్యవస్థలు రద్దయ్య అన్నారు. ఆ వ్యవస్థలో రద్దవటం కారణంగా ఎంతోమంది భూమిలేని కౌలు రైతులకు భూమి లభించింది అన్నారు. కార్మికులందరూ కమ్యూనిస్టు పార్టీల అందరితో ముఖ్యంగా ఏఐటియుసి ఆధ్వర్యంలో చెప్పిన పోరాటాల ఫలితంగా 44 కార్మిక హక్కు చట్టాలను సాధించుకున్నాయన్నారు. స్వాతంత్రం అనంతరం కూడా ఇన్ని సంవత్సరాల పాటు దేశంలో రాచరిక వ్యవస్థ నడిచిందనటానికి నాటి నిజాం రాజును అప్పటి కేంద్ర ప్రభుత్వం రాజ్ ప్రముఖ్ గా నియమించటమేనన్నారు. అటువంటి రూపుమాపటానికి సిపిఐ చేసిన పోరాటం అజరామరం అన్నారు. దేశ స్వాతంత్రం తో పాటు దేశంలోని ప్రజల హక్కులను ఆస్తులను పరిరక్షించడానికి సిపిఐ చేసిన పోరాటం నేటి యువత తప్పక తెలుసుకోవాలన్నారు.

### కమ్యూనిస్టుగా ఉంటే గుండెలనిండా గర్వంగా ఉంటుంది..మహమ్మద్ మౌలానా

కమ్యూనిస్టుగా ఉంటే గుండెల నిండా గర్వంగా ఉంటుందని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా అన్నారు. బుధవారం కూసుమంచి మండల కేంద్రంలో జరిగిన పార్టీ మండల 6వ మహాసభలో వారు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు..రాను నా స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ సత్తా చాటాలని, పార్టీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజాసంఘాల నాయకులు కృషి చేయాలని సూచించారు.

### ఇల్లు కావాలని అడిగింది కమ్యూనిస్టులే: జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్

పేద ప్రజలకు ఇల్లు కట్టించాలని మొట్టమొదటిసారి అసెంబ్లీలో ప్రస్తావించింది కమ్యూనిస్టులేనని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అన్నారు. 1973వ సంవత్సరంలో ప్రతిపక్ష నేతగా ఉన్న సిపిఐ శాసనసభ్యులు మహమ్మద్ రజబ్ అలీ అసెంబ్లీలో పేదలకు ఇల్లు కట్టించడానికి 5,000 రూపాయలను మంజూరు చేయాలని అడగగా అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ఒప్పుకున్నారని ఆయన తెలిపారు. అలా కమ్యూనిస్టులు అడిగిన 5000 నుండి ఈరోజు 5 లక్షల వరకు ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తుందంటే అది కమ్యూనిస్టులు చలవేనన్నారు. 2006వ సంవత్సరంలో రైతుల రుణమాఫీలు చేయాలని బ్యాంకులు ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో 48 గంటల పాటు ఆందోళన కార్యక్రమం చేస్తే అవహేళన చేశారని, రైతుల రుణాలు మాఫీ ఎలా చేస్తారని అప్పటి ప్రభుత్వ పెద్దలు ఎద్దేవా చేశారన్నారు. బడా పెట్టుబడిదారులకు రుణాల మాఫీ చేసినప్పుడు దేశానికి అన్నం పెట్టే రైతన్న బ్యాంకు రుణమాఫీ ఎందుకు చేయకూడదని ప్రశ్నించగా తొలుత 25 వేల రూపాయల రుణమాఫీ చేయటానికి అప్పటి ప్రభుత్వాలు ముందుకు వచ్చాయని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్ర సమితి సభ్యులు జమ్మల జితేందర్ రెడ్డి మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీకి గైగోళ్లపల్లి నిలయంగా ఉందన్నారు. ఈ గ్రామాన్ని కమ్యూనిస్టులే పాలించిన సంగతి ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. సంగబత్తుల వెంకటరెడ్డి కమ్యూనిస్టు పార్టీని అభివృద్ధి చెందించడంలో కీలక పాత్ర పోషించారని ఆయన కొనియాడారు. ఆయన లేకుండా మండల మహాసభలు జరగటం బాధాకరమైన విషయం అన్నారు. ఆయన జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి, తెలంగాణ గిరిజన సమైక్య రాష్ట్ర అధ్యక్షులు అజ్మీరా రామ్మూర్తి నాయక్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తోటా రామాంజనేయులు, జిల్లా సమితి సభ్యులు గుండేపంగు మల్లేష్, మండల కార్యదర్శి భూక్యా నరసింహ, మండల పార్టీ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.